ఉద్యోగులకు రావాల్సిన
పెండింగ్ డీఏలు చెల్లించాలి

టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

కామారెడ్డి, ఫిబ్రవరి 5: ఉద్యోగులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి అన్నారు. కామారెడ్డిలోని టీఎన్జీవోస్ భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల పెండింగ్ డీఏలు, బిల్లులు ప్రభుత్వం మంజూరు చేయాలని కోరారు. ఉద్యోగులకు 51శాతం ఫిట్‌మెంట్ వెంటనే మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి నాగరాజు, కోశాధికారి దేవ రాజు, ఉపాధ్యక్షుడు సాయిలు, శ్రావణ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పౌల్ట్రీ వ్యాపారులను ప్రభుత్వం ఆదుకోవాలి

బాన్సువాడ, ఫిబ్రవరి 5: పౌల్ట్రీ వ్యాపారులను ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ నాయకుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ జుబేర్ ప్రభుత్వాన్ని కోరారు. బాన్సువాడలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల అంతుచిక్కని వ్యాధితో వేలాది కోళ్లు మృతిచెందుతున్నాయని అన్నారు. దీంతో వాటిని పెంచే రైతులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. లక్షలాది రూపాయలను నష్టపోవడంతో ఏమి చేయాలో తోచని స్థితిలో ఉన్నారని తెలిపారు. కోళ్లు ఎందుకు మృతిచెందుతున్నాయనే విషయాన్ని గుర్తించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని, వ్యాధిపై రైతులు, వ్యాపారులను అప్రమత్తం చేయాలన్నారు. చికెన్ తినాలంటే ప్రజలు కూడా భయపడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

అవగాహన కల్పిస్తున్న ఎస్సై ప్రభాకర్

బీబీపేట్, ఫిబ్రవరి 5: ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ప్రభాకర్ అన్నారు. బీబీపేట పోలీస్ స్టేషన్ ఆవరణలో రైతులు, గ్రామ పెద్దలతో బుధవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఇటీవల సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి డెబిట్, క్రెడిట్ కార్డులను అప్‌డేట్ చేయాలని, బహుమతి వచ్చింది.. ప్రాసెసింగ్ ఫీజు పంపాలని అడుగుతారన్నారు. వారి మాటలు నమ్మొద్దని సూచించారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్‌తో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రశాంత వాతావరణంలో జీవించాలని, చట్టాలను చేతిలోకి తీసుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు సాయిబాబా, మల్లేశం, సిబ్బంది రవి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీ చేయాలి

ఐసీడీఎస్ సీడీపీవోలు, సూపర్‌వైజర్లతో కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, ఫిబ్రవరి 5: ఐసీడీఎస్ సీడీపీవోలు, సూపర్‌వైజర్లు తరచూ అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అంగన్‌వాడీ భవన నిర్మాణాలు, విద్యుత్ సరఫరా, తాగు నీరు తదితర అంశాలపై ఆయన అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సీడీపీవోలు, సూపర్‌వైజర్లు నెలలో కనీసం 20 అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలని సూచించారు. కేంద్రాల్లో పారిశుద్ధ్యం, నీటి సరఫరా, పోషకాహారం, బాలామృతం, బియ్యం తదితర సరుకు స్టాకు రిజిస్టర్లను తనిఖీ చేయాలన్నారు. కేంద్రాలకు చిన్నారులు ప్రతిరోజూ వచ్చేలా చూడాలన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను నడుపొద్దని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు, విద్యుత్ సరఫరా కోసం చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా సంక్షేమాధికారిణి ప్రమీల, ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రావణ్‌కుమార్, పంచాయతీ రాజ్ ఈఈ దుర్గాప్రసాద్, మిషన్ భగీరథ ఈఈ రమేశ్, ఇంజినీరింగ్ అధికారులు, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కుల గణన సర్వే వేతనం విడుదల చేయాలి

ఎంపీడీవో బషీరుద్దీన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

బాన్సువాడ రూరల్, ఫిబ్రవరి 5: సమగ్ర కుల గణన సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు అందించాల్సిన గౌరవ వేతనం రాష్ట్ర ప్రభుత్వం త్వరగా విడుదల చేయాలని కోరుతూ ఎంపీడీవో బషీరుద్దీన్‌కు ఉపాధ్యాయులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఇంటింటికీ తిరిగి కులగణన సర్వే చేపట్టామని, ఇందుకోసం ఇస్తామన్న గౌరవ భృతిని వెంటనే చెల్లించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నక్క ప్రవీణ్, శ్రీనివాస్, సాయిరాం, శ్రీకాంత్‌రెడ్డి, విఠల్, గంగారాం, పండరి పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చూడాలి

బీబీపేట్, ఫిబ్రవరి 5: వేసవి కాలంలో నీటి ఎద్దడిలేకుండా చూడాలని ఎంపీడీవో పూర్ణ చంద్రోదయకుమార్, ఎంపీవో అబ్బాగౌడ్ అన్నారు. బుధవారం బీబీపేట మండలంలోని మాల్కాపూర్, ఉప్పర్‌పల్లి, ఇస్సానగర్ గ్రామాల్లో వారు పర్యటించారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, వెన్నెల, నరేందర్, మిషన్ భగిరథ ఏఈ రజిత తదితరులు పాల్గొన్నారు.

ఉప్పర్‌పల్లిలో వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో తదితరులు

కల్యాణ లక్ష్మి నగదు స్వాహాపై విచారణ

బీర్కూర్ తహసీల్దార్ లతతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

నస్రుల్లాబాద్, ఫిబ్రవరి 5: బీర్కూర్ మండలంలోని వీరాపూర్ గ్రామానికి చెందిన పవర్ సాంబయ్య కూతురు మమత పేరిట కల్యాణ లక్ష్మి నగదు స్వాహాపైన వచ్చిన ఫిర్యాదు మేరకు బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి బుధవారం విచారణ చేపట్టారు. బీర్కూర్ తహసీల్ కార్యాలయానికి చేరుకున్న ఆమె.. డబ్బులు ఎలా డ్రా చేసుకున్నారు..? ఇందులో ఎవరి ప్రమేయం ఉన్నదనే విషయాలపై ఆరా తీశారు. మండలంలో ఇలాంటి ఘటనలు ఇంకా ఏమైనా జరిగాయా అని తెలుసుకున్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి నివేదిక అందజేయాలని తహసీల్దార్ లతను ఆదేశించారు.

ఆలయ ప్రాంగణంలో బైక్ చోరీ

మాచారెడ్డి, ఫిబ్రవరి 5: మండలంలోని చుక్కాపూర్ ఆలయ ప్రాంగణంలో బైక్ చోరీకి గురైనట్లు ఎస్సై అనిల్ బుధవారం తెలిపారు. గన్నం శంకర్‌రావు ఈనెల 2వ తేదీన చుక్కాపూర్ ఆలయం ఎదుట బైక్ పార్క్ చేసి, లోపలికి వెళ్లి స్వామి వారిని దర్శించుకున్నాడు. కొద్ది సమయం అనంతరం బయటికి వచ్చి చూసే సరికి బైక్ కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

బైక్ అదుపు తప్పి ఒకరికి గాయాలు

మాచారెడ్డి, ఫిబ్రవరి 5: ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన పాల్వంచ మండలంలోని భవానీపేట గ్రామశివారులో బుధవారం చోటు చేసుకున్నది. స్థానికులు, 108 అంబులెన్స్ సిబ్బంది తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూల్ జిల్లాకు చెందిన ఇప్పి రమణ రామాయంపేటలో నివసిస్తున్నాడు. పని నిమిత్తం భవానీపేటకు బైక్‌పై వస్తుండగా అదుపు తప్పి కింద పడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. క్షతగాత్రుడిని కామారెడ్డి ఏరియా వైద్యశాలకు తరలించినట్లు 108 అంబులెన్స్ ఈఎంటీ మెతుకు నరేశ్, పైలట్ తరుణ్ తెలిపారు.

స్వదేశీ మేళా పోస్టర్ల ఆవిష్కరణ

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్

భిక్కనూరు, ఫిబ్రవరి 5: కామారెడ్డిలో ఈనెల 11నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్న స్వదేశీ మేళా పోస్టర్లను సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వదేశీ ఉత్పత్తుల ఆర్థిక స్వావలంబన, స్వదేశీ పరిజ్ఞాన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, భారతీయ క్రీడా స్ఫూర్తి జీవన వైవిధ్యాలు తదితర అంశాలపై ఈ మేళాలో వివరించడంతోపాటు స్వదేశీ ఉత్పత్తుల విక్రయ కేంద్రాలు కూడా ఉంటాయని తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని, మేళాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో స్వదేశీ జాగరణ మంచ్ జిల్లా కన్వీనర్ వంగ రాహుల్ కుమార్, విభాగ్ విచారక్ యాలాద్రి, సంఘర్షణ ప్రముఖ్ సంతోష్ గౌడ్, మెదక్ జిల్లా కన్వీనర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పనులు ప్రారంభించారు.. నిర్లక్ష్యంగా వదిలేశారు

కాద్లాపూర్‌లో అసంపూర్తిగా ఉన్న గోదాం

బాన్సువాడ రూరల్, ఫిబ్రవరి 5: మండలంలోని కాద్లాపూర్‌లో చేపట్టిన గోదాం నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. గ్రామంలో ఎస్‌డీఎఫ్‌లోని రూ.ఐదు లక్షల మిగులు బడ్జెట్‌తో గోదాం నిర్మాణ పనులను ప్రారంభించారు. కాంట్రాక్టర్ పనులు పూర్తిచేయకుండా మధ్యలోనే నిలిపివేశాడు. దీంతో ప్రస్తుతం గోదాం చుట్టూ పిచ్చి మొక్కలు మొలిచి రైతులకు అందుబాటులో లేకుండా పోయింది. లక్షలాది రూపాయలతో చేపట్టిన పనులు మధ్యలోనే నిలిపివేశారని రైతులు వాపోతున్నారు. గోదాంకు షట్టర్ బిగిస్తే అందుబాటులోకి వస్తుందని వారు అంటున్నారు.

కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పుట్టినరోజు వేడుకలు బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బీఆర్ఎస్ పట్టణ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. 62వ పుట్టిన రోజు సందర్భంగా ఆయనతో కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్ రెడ్డి, యూత్ అధ్యక్షుడు చెలిమల భానుప్రసాద్, నాయకులు కృష్ణయాదవ్, ఈశ్వర్, సమీర్, బాబాగౌడ్, రాజ్ కుమార్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

- కామారెడ్డి, ఫిబ్రవరి 5

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

బీబీపేట్ (దోమకొండ), ఫిబ్రవరి 5: పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని దోమకొండ పంచాయతీ కార్యదర్శి యాదగిరి అన్నారు. దోమకొండలోని 16 వార్డుల్లో బుధవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. డ్రైనేజీలను శుభ్రం చేసి, మురికి కాలువల్లో దోమలు వృద్ధి చెందకుండా మందు చల్లించారు. కాలనీలో కొత్తగా వీధి దీపాలను అమర్చారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైనేజీని శుభ్రం చేస్తున్న కార్మికులు

గుట్ట తవ్వకం పనుల పరిశీలన

లింగంపల్లి కలాన్ గ్రామ శివారులో గుట్ట తవ్వకం పనులు చేపడుతున్న స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 5: మండలంలోని లింగంపల్లి కలాన్ గ్రామ శివారులో ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో గుట్టల తవ్వకం చేసిన స్థలాన్ని తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ మహ్మద్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సర్వేనెంబర్ 230లో అక్రమంగా గుట్టను తవ్వి భూమి చదును పనులు చేపడుతున్నట్లు పలు దినపత్రికల్లో బుధవారం వార్తా కథనాలు రావడంతో.. మరోమారు వెళ్లి పనులను చూసినట్లు ఆయన చెప్పారు. పనులు చేపట్టవద్దని, అక్కడ ఉన్న వారికి సూచించామని పేర్కొన్నారు.

బడి బయటి బాలుడి గుర్తింపు

నిజాంసాగర్, ఫిబ్రవరి 5 : మహ్మద్‌నగర్ మండలం కోమలంచ గ్రామ ఆవాసంలో గొర్రెల కాపరిగా ఉన్న మహేందర్ అనే బడి బయటి బాలుడిని బుధవారం సీఆర్పీలు వెంకట రామాగౌడ్, శంకర్‌గౌడ్ గుర్తించారు. కుర్మ సాయిలు అనే యజమాని వద్ద గొర్రెల కాపరిగా బాలుడు పని చేస్తున్నాడు. యజమానికి కౌన్సెలింగ్ నిర్వహించి పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

బిచ్కుంద, ఫిబ్రవరి 5: మండలంలోని హస్గుల్ గ్రామ మండల పరిషత్ పాఠశాలను ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల అపార్ ఐడీ జనరేట్ త్వరితగతిన పూర్తిచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఆయనవెంట ప్రధానోపాధ్యాయుడు విజయ్, ఉపాధ్యాయులు రవి, శంకర్, విద్యార్థులు ఉన్నారు.

నులిపురుగు నివారణ మందుల పంపిణీ

పెద్ద కొడప్‌గల్,(పిట్లం) ఫిబ్రవరి 5 : పిట్లం మండలంలోని చిల్లర్గి గ్రామంలో పశు వైద్యులు పశు సంతానోత్పత్తి శిబిరాన్ని బుధవారం నిర్వహించి పాడి రైతులకు నులిపురుగుల నివారణ మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సంతోష్ మాటాడారు. అనంతరం పశు సంవర్ధక శాఖ, డీఎల్‌డీఏ సమన్వయంతో రైతులకు పరిశుభ్రమైన, సురక్షితమైన పాలు పితికే విధానాలపై అవగాహన కల్పించారు. పాలు పితికే సామర్థ్యాన్ని బట్టి ముగ్గురు ఉత్తమ రైతులను ఎంపిక చేసి పాల డబ్బాలు, కాల్షియం బాటిళ్లు, నులిపురుగుల నివారణ మందులను పంపిణీ చేశారు.

లింగంపేటలో పారిశుద్ధ్య పనుల నిర్వహణ

లింగంపేట, ఫిబ్రవరి 5: మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో బుధవారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. బస్టాండ్ పరిసరాల్లోని కాలనీల్లో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించడంతోపాటు మురికి కాలువల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించి శుభ్రం చేశారు. దోమల నివారణకు బ్లీచింగ్ పౌడర్ వేశారు. పనుల నిర్వహణను ఎంపీడీవో నరేశ్ పరిశీలించారు. ఎంపీడీవోవెంట గ్రామకార్యదర్శి శ్రావణ్,సిబ్బంది ఉన్నారు.

ఎల్లారెడ్డిలో దొంగతనం

● 3 తులాల బంగారు నగలు.. రూ.45 వేల నగదు అపహరణ

దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎస్సై

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 5: తాళం వేసి ఉన్న ఇంటిలో దొంగతనం జరిగినట్లు ఎల్లారెడ్డి ఇన్‌చార్జి ఎస్సై గంగారెడ్డి బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన మహ్మద్ జునైద్ కూరగాయల వ్యాపారి. ఈనెల 4వతేదీ మంగళవారం అతడు తన చిన్నన్నతో కలిసి మహ్మద్‌నగర్‌లో కూరగాయలు అమ్మడానికి వెళ్లాడు. ఆ సమయంలో జునైద్ భార్య ఇషా తరణ్నమ్, అతడి చిన్న వదినె అయిన అమీనాబేగం కలిసి తమ ఇండ్లకు తాళాలు వేసి జునైద్ పెద్దన్న ఇంట్లోని అల్మారాలో ఉంచి, మధ్యాహ్నం 3.30 గంటలకు పట్టణంలోని నాగేశ్వర్‌రావు దవాఖానకు వెళ్లారు.

తిరిగి సాయంత్రం 7.20 గంటలకు ఇంటికి తిరిగి రాగా తాళాలు తీసి ఉన్నాయి. జునైద్ ఇంట్లోని బీరువాలో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు 2తులాల బంగారు నెక్లెస్, తులం బంగారు పుస్తెలతాడు, 45 వేల రూపాయల నగదు దొంగిలించారు. జునైద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై గంగారెడ్డి తెలిపారు.

ఇంటింటికీ నీటి సరఫరా చేయాలి

రెడ్డిపేట గ్రామ పంచాయతీలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో తిరుపతిరెడ్డి

ఎల్లారెడ్డిరూరల్, ఫిబ్రవరి 5: గ్రామాల్లో చిట్టచివరగా ఉన్న ఇంటికి కూడా నీటిసరఫరా చేయాలని ఎంపీడీవో ప్రకాశ్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని తిమ్మారెడ్డి, ఆజామాబాద్, అన్నాసాగర్ గ్రామాలను ఆయన సందర్శించారు. వచ్చే ఎండాకాలంలో గ్రామాల్లో ఎక్కడా తాగునీటికి ఇబ్బందులు ఎదురుకాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. రిపేర్‌లో ఉన్న బోరుమోటర్లను గుర్తించి వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. అన్నాసాగర్‌లో మూలకుపడి నిరుపయోగంగా మారిన బోరు మోటర్‌ను ఆయన వెంటనే మరమ్మతు చేయించారు. ఆయనవెంట గ్రామాల కార్యదర్శులు సంతోష్, రాజు, విజయ్ ఉన్నారు.

వేసవిలో తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలి..

రామారెడ్డి, ఫిబ్రవరి 5: మండలంలోని రెడ్డిపేట్ గ్రామాన్ని ఎంపీడీవో తిరుపతిరెడ్డి బుధవారం సందర్శించారు. గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. రానున్న వేసవికాలం దృష్ట్యా మిషన్‌భగీరథ ఏఈ వంశీతో కలిసి గ్రామంలోని ప్రధాన వీధుల్లో పర్యటించారు. మిషన్ భగీరథ వాటర్ పైప్ లీకేజీలు, పని చేయని బోరుమోటర్లను మరమ్మతులు చేయించాలని గ్రామ కార్యదర్శి నరేశ్‌కు సూచించారు. ఆయన వెంట గ్రిడ్ ఏఈ విశాల్, మిషన్ భగీరథ సిబ్బంది ఉన్నారు.

నీటి ట్యాంకులు శుభ్రం చేయాలి ..

లింగంపేట(తాడ్వాయి), ఫిబ్రవరి 5: నిత్యం ప్రజలకు తాగునీటిని సరఫరా చేసే వాటర్ ట్యాంకులను శుభ్రం చేయాలని మిషన్ భగీరథ ఏఈ ప్రశాంత్ పంచాయతీ సిబ్బందికి సూచించారు. తాడ్వాయి మండల కేంద్రంలోని వాటర్ ట్యాంకులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్యాంకులు శుభ్రం చేయడంతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, తాగునీటిని క్లోరినేషన్ చేసి సరఫరా చేయాలని గ్రామ కార్యదర్శి బాలయ్యకు సూచించారు. ఆయన వెంట పంచాయతీ సిబ్బంది లక్ష్మి, స్వామి, గంగారాం తదితరులు ఉన్నారు.

నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్
సందర్శించిన ఎస్పీ

నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ సింధూశర్మ

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 5: నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ సింధూశర్మ బుధవారం సందర్శించారు. స్టేషన్‌లో కలియదిరిగి గదులను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. వివరాలను డీఎస్పీ శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. పోలీసులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజలతో స్నేహభావంతో మెలగాలని సూచించారు. కేసులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలన్నారు. పోలీస్‌స్టేషన్ నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. స్టేషన్ ముందు నుంచి నూతన రహదారి ఏర్పాటు చేయడంతో..స్టేషన్ 10 అడుగుల లోతులో పడిపోయినట్లు గుర్తించిన ఎస్పీ చుట్టూ తిరిగి పరిశీలించారు. స్టేషన్‌లోకి వాహనాలు వెళ్లడానికి ఇబ్బందులు ఏర్పడుతున్నందున ఈశాన్యం మూల నుంచి రోడ్డును ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై మల్లారెడ్డికి సూచించారు. ఆమెవెంట సీఐ రవీందర్‌నాయక్ తదితరులు ఉన్నారు.

సైబర్ నేరగాళ్లతో
అప్రమత్తంగా ఉండాలి

లింగంపేట, ఫిబ్రవరి 5: గ్రామీణ ప్రాంత ప్రజలు సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని స్థానిక పోలీసులు సూచించారు. బుధవారం సాయంత్రం లింగంపేటలో గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లు పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంత ప్రజలను మోసాలు చేస్తూ డబ్బులు కాజేస్తున్నట్లు వివరించారు. బ్యాంకు ఖాతా అప్‌డేట్ చేసుకోవాలని బ్యాంకు అధికారుల పేరిట ఫోన్లు చేసి బ్యాంకు ఖాతాల్లోని డబ్బులు ఖాళీ చేస్తారన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ వస్తే స్పందించ వద్దని, పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఆయనవెంట పోలీసు సిబ్బంది రమేశ్‌రెడ్డి, శంకర్, హోంగార్డులు హమీద్, మదన్ తదితరులు ఉన్నారు.

లింగంపేట మండల కేంద్రంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిలో బస్‌డిపో ఏర్పాటుచేయాలి

● మంత్రికి వినతిపత్రం ఇచ్చిన ఎమ్మెల్యే

రవాణాశాఖామంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే

ఎల్లారెడ్డిరూరల్, ఫిబ్రవరి 5: ఎల్లారెడ్డి పట్టణంలో బస్‌డిపో ఏర్పాటు చేయాలని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఎల్లారెడ్డిలో బస్‌డిపో ఏర్పాటు తప్పనిసరి అయిందని, పట్టణం అభివృద్ధి చెందుతున్నందున ప్రతి నిత్యం ఎల్లారెడ్డికి వందలాది మంది ప్రజలు ఆయా పనుల నిమిత్తం వస్తూపోతుంటారన్నారు. ఎల్లారెడ్డికి రావాలన్నా, ఎక్కడికైనా వెళ్లాలన్నా బస్‌సౌకర్యం విరివిగా ఉండాలన్నారు. మారుమూల పల్లెలకు సైతం బస్సులు వెళ్లాలంటే బస్‌డిపో ఏర్పాటు తప్పనిసరని ఆయన పేర్కొన్నారు.

జిల్లాస్థాయి ఫిజికల్ సైన్స్ పోటీలకు
మోడల్ స్కూల్ విద్యార్థులు

విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ గాంధీ

ఎల్లారెడ్డిరూరల్, ఫిబ్రవరి 5: జిల్లా స్థాయి ఫిజికల్‌సైన్స్ పోటీలకు ఎల్లారెడ్డి మోడల్‌స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ గాంధీ బుధవారం తెలిపారు. గతనెల 31న ఎల్లారెడ్డి పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి ఫిజికల్‌సైన్స్ పోటీల్లో తమ స్కూల్ విద్యార్థినులు ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో పావని, అక్షర, మానస నిలిచి.. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను అభినందించారు. ఆయనతో పాటు ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు జహంగీర్,ఉపాధ్యాయులు రాజశేఖర్, విద్యారమణ, బలవంత్‌రావు ఉన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

పెద్దకొడప్‌గల్,(పిట్లం) ఫిబ్రవరి 5 : అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై రాజు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా మంజీరా నది నుంచి అక్రమంగా తరలిస్తున్న ఐదు ఇసుక ట్రాక్టర్లు పిట్లం మండలంలోని బండపల్లి గ్రామంలో పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆరెపల్లిలో..

నిజాంసాగర్, ఫిబ్రవరి 5: మండలంలోని ఆరెపల్లి గ్రామానికి చెందిన కొంకుల నర్సింహులు బుధవారం మధ్యాహ్నం తన సొంత ట్రాక్టర్‌పై ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తుండగా ట్రాక్టర్‌ను సీజ్ చేసి, కేసు నమోదు చేశామని నిజాంసాగర్ ఎస్సై శివకుమార్ తెలిపారు.

కంటైనర్ ఢీకొని ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డిరూరల్, ఫిబ్రవరి 5: కంటైనర్ ఢీకొట్టడంతో ఒకరికి తీవ్రగాయాలైన ఘటన ఎల్లారెడ్డి పట్టణంలో బుధవారం చోటు చేసుకున్నది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు చెప్పిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రాఘవపల్లి గ్రామానికి చెందిన కుర్మ రాజు ఎల్లారెడ్డిలో పనిముగించుకొని బైక్‌పై తిరిగి ఊరికి వెళ్తున్నాడు. ఎల్లారెడ్డి పెద్దచెరువు కట్టపై గంగమ్మ ఆలయం దాటిన తర్వాత ఎదురుగా వస్తున్న కంటైనర్ ఢీ కొట్టడంతో రాజు బైక్‌పై నుంచి కట్ట కింద పడిపోయాడు. స్థానికులు వెంటనే అంబులెన్స్, పోలీసులకు సమాచారమందించారు. తీవ్రగాయాలైన రాజును ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు.